# అడవి పువ్వు

వారం రోజులనుంచీ ఆ ఊళ్లో జ్ఞానానందస్వామి వారి పేరు, ప్రతిభ, వేదాంతోపన్యాస విశేషాలు వేనోళ్ల కొనియాడబడుతున్నాయి. ఆయన ఆ ఊరికి వేంచేసి వారం రోజులయింది. ఈ వేళ ఆఖరి రోజు ఉపన్యాసాలకి. రేపు ఈ ఊరు విడిచి వెళ్లిపోతా రాయన.

ఈ వారం రోజులనుంచి రాజ్యలక్ష్మికి తీరుబడి లేదు. మొదటి రోజు పక్క ఇంటి కామాక్షిగారు రమ్మని బలవంతం చేస్తే వెళ్లింది. మరునాటి నుంచి తనంతట తానే అయస్కాంతం ఆకర్షించిన ఇనుము లాగ ఆలయానికి వెడుతూంది. దూరం నుంచే ఆయన్ని చూస్తూంది. ఆయన చెప్పేది కూడా వినటం లేదు. చూస్తుంటేనే మనసొక విభ్రమానికి లోనౌతూంది.

ఈ వేళ ఆఖరి రోజు. మనసు ఇన్నాళ్లూ లేని ఆలోచనలో పడింది ఈ వేళ–కర్తవ్యమేమిటో తెలియనిదాని లాగ!

పళ్లెంలో పళ్లు అమర్చుకుని వెళ్లటానికి సిద్ధమవుతూంది రాజ్యలక్ష్మి.

''వదినా! ఎప్పుడూ లేదు. మరీ అంత పిచ్చేమిటి నీకు!'' అంది కస్తూరి, బుజ్జికి తల దువ్వుతూ

వదిన వారం రోజులనుంచీ ఇంటి సంగతులు పట్టించుకోవటం లేదు.

కస్తూరి మాటలకి రాజ్యలక్ష్మి తలా, నడుం వెనక్కి వంచి సున్నితంగా విరగబడి నవ్వుతూ అంది:

''నీకు తెలియదు, కస్తూరీ! ఈయన..... ఈ మహాత్ముణ్ణి చూసి నా జన్మ తరించింది. ఇంత ఆనందం నా జన్మలో నేను ఎప్పుడూ పొందలేదు.''

''ఏమిటో ఆట్లాగ నవ్వుతావు?'' అంది కస్తూరి, తనలో తను అనుకుంటున్నట్లు.

తనకి తల దువ్వుతున్న కస్తూరిని విదిలించుకుని రాజ్యలక్ష్మి దగ్గరికి పరుగెత్తుకు వచ్చాడు బుజ్జి. రాజ్యలక్ష్మి కాళ్ళ చుట్టూ చేతులు వేసి, ''ఈ వేళ నాకు ఏం ఫలహారం చేస్తావు, అమ్మా'' అని అడిగాడు.

రోజూ వాడు స్కూలునుంచి ఇంటికి వచ్చేటప్పటికి తినటానికి ఒక పిండి వంట చేసి సిద్ధంగా ఉంచుతుంది రాజ్యలక్ష్మి. ''నిన్న చేగోడీలు అయ్యాయి. ఈ వేళ నీకు ఏం కావాలో చెప్పు, బుజ్జీ!'' అంది.

''కోవా కజ్జికాయలు'' అన్నాడు వాడు.

వంగి వాడి పాల బుగ్గలు ముద్దు పెట్టుకుంది రాజ్యలక్ష్మి.

''సరే, స్కూలుకి వెళ్ళిరా'' అంది.

వాడు మళ్ళీ కస్తూరి దగ్గరికి వెళ్ళాడు. వంటావిడతో కోవా చేసి ఉంచమని చెప్పి ఆలయానికి బయలు దేరింది రాజ్యలక్ష్మి. ఫాలం మధ్యన పూర్ణ చంద్రుడి లాంటి బొట్టు, ఒంటి నిండా నగలు, పట్టు చీర, రవిక. ప్రౌఢ వయసులో నున్నా, దృఢంగా ఉన్న దేహం. కాంతి తరగని మేని ఛాయ- ఆవిడ రూపం! చకచకా నడిచి ఆలయాన్ని సమీపించింది. అక్కడ భజన జరుగుతూంది. వేదిక మీద స్వామిజీ ధ్యానముద్రలో ఉన్నారు. భక్తులు ఆయన కిరువైపులా కూర్చుని భజన గీతాలు పాడుతున్నారు.

పొడవైన గడ్డంతో స్వామీజీ గంభీరంగా ఉన్నారు. ఆయన ముక్కుకి దగ్గిరగా బుగ్గ మీద పుట్టుమచ్చ ఉంది. దాని మీద రాజ్యలక్ష్మి చూపు నిలిచిపోయింది. ఈ వేళ కాదు, మొదటి రోజు ఆయన్ని చూసినప్పుడే.... ఆ పుట్టుమచ్చని చూస్తూంటే కాలం తనని గిరగిరా తిప్పి పన్నెండేళ్ళు వెనక్కి విసిరినట్లయింది. అప్పుడు జరిగిన సంగతులు ఒకదాని వెంట ఒకటి ఇప్పుడు జరిగినట్లుగా మనసులో నిలిచాయి. పన్నెండేళ్ల క్రిందట ... తమ బ్రతుకుల్ని కథగా చెప్పుకుంది లోకం!

లేకలేక రాజ్యలక్ష్మికి కొడుకు పుట్టాడు. రేశ్యాలోలుడైన ఆమె భర్త కృష్ణమూర్తి

గోదావరిలో మునిగి చచ్చిపోయాడు. ఆ కొడుకుని విధవాడబిడ్డ కస్తూరి పెంచుతూంది— అని లోకం చెప్పకుంది.

'కానీ, అసలు జరిగిన కథ?'

అడవి పువ్వు విరజిమ్మిన ఘాటు వాసన లాగ దేహాన్ని చీల్చుకుని ఒక వింత నవ్వు రాజ్యలక్ష్మి పెదవుల మీద విరిసింది.

* * * *

అది క్రిష్ణమూర్తిగారి ఇంట్లో మధ్య ఉన్న పెద్దహాలు. సోఫాలూ, తివాచీ, పెద్దపెద్ద చిత్రపటాలతో జమీందార్ల ఇంటిని తలపింపజేస్తూంది. ఆ హాలులో ఒక పక్కగా పైకి మేడమీదకి వెళ్లటానికి మెట్లు ఉన్నాయి. ఆ మెట్లదగ్గర నిలబడి కస్తూరి నేల చూపులు చూస్తూంది. ప్రసాదరావు మెట్లు ఎక్కటానికి సిద్ధంగా నిలబడి ఉన్నాడు.

'ఎందు కట్లాగ నిలబడిపోతావు? నే నేమంటానో అనే కదూ నీ సంశయం? నేనూ మనిషినే, కస్తూరీ! మనకి మనమే భయపడితే బ్రతకలేము. ఒక మనిషితో స్నేహంగా ఉండటానికి అంత సంశయిస్తా వెందుకు? కంచె చేను మేస్తుంటే చేను గాలి పీల్చుకోవచ్చా, లేదా అని సందేహిస్తోందిట! వెళ్లు. అతడు నీ కోసం చూస్తున్నాడు'' అంది రాజ్యలక్ష్మి.

''నువ్వు 'మనిషి'ని అంటున్నావు కానీ, దేవతవేమో అని నా అనుమానం, వదినా!'' అంది కస్తూరి ఆరాధనా పూర్వకంగా చూస్తూ.

కస్తూరి మాటలకి రాజ్యలక్ష్మి విరగబడి నవ్వింది. నవ్వుతూంటే ఆవిడ ఒంటి మీద ఉన్న నగలు— చెవులకున్న వజ్రాల దుద్దులు, ముక్కున ఉన్న బేసరి— తళుకుమంటున్నాయి. మెడలో పలక సరులూ, చేతి గాజులూ గలగలలాడాయి. వడ్డాణంలో నడుము ఇటూ, అటూ ఊగింది. ఆ కళ్లలోంచి మనిషి అంద నుంతా జలపాతం లాగ దూకుతూంది అనిపించింది కస్తూరికి. కస్తూరికి వదినని చూస్తే ఎప్పుడూ అట్లాగే అనిపిస్తుంది. వెంటనే అన్నయ్య మూర్ఖుడు అనుకుంటుంది. కానీ, రాజ్యలక్ష్మి నవ్వుతూంటే కస్తూరికి భయం వేస్తుంది. ఆ నవ్వు అర్థం కాదు. అందుకని వెంటనే రాజ్యలక్ష్మి నుంచి చూపులు మరల్చుకుని ప్రసాదరావుని చూస్తూ, ''పద'' అంది.

ఇట్లాగ రోజూ జరుగుతున్నా, అతడికి మెట్లు ఎక్కే ముందర కస్తూరికి సంశయం వస్తుంది. వదిన అక్కడ ఉంటే మరీను.

కస్తూరి ముందు మెట్లు ఎక్కుతూంది. ఆమె వెనకాల ప్రసాదరావు మెట్లు ఎక్కుతున్నాడు. మెట్లు ఎక్కుతున్న కస్తూరి తనను స్వర్గసోపానాల మీద నడిపిస్తున్న దేవకన్య లాగ ఉంది అతడికి. అతడికి మెలకువగా ఉన్నట్లుగా లేదు. కలలో విహరిస్తున్నట్లుగా ఉంది. తన ముందు కస్తూరి నడుస్తూంటే చీరకి, జాకెట్టుకి మధ్య మెరిసిపోతున్న నడుముని తన బాహువుల్లో బంధించాలని, పొడుగ్గా ఉండి పిరుదుల్ని తాకుతున్న జడని స్పృశించాలని అతడిలో కోరికలు రేకెత్తుతున్నాయి.

మెట్లు ఎక్కి పైకి వెళ్లారు. అక్కడ పెద్ద హాలులో తివాచీ పరిచి ఉంది– తెలుపు, ఎరుపు, నలుపు రంగుల నేతలో దానిమీద ఒక కేరంబోర్డు ఉంది. ప్రసాదరావు దానికి ఒక వైపున కూర్చుని అక్కడ డబ్బాలో ఉన్న పౌడరుని బోర్డు మీద చల్లాడు. అలమారులోంచి కాయిన్సు తెచ్చి బోర్డుమీద పంపింది కస్తూరి.

ప్రసాదరావు వాటిని సర్దాడు. స్ట్రైకర్ని కస్తూరి వైపు తోసి ''నువ్వు మొదలుపెట్టు. పాపం చిన్నపిల్లవి కదూ!'' అన్నాడు నవ్వుతూ.

''బాగా ఆట వచ్చని బడాయి నీకు. ఎప్పుడో నిన్ను గెలిచేస్తాను. చూస్తుండు'' అంది కస్తూరి.

ప్రసాదరావు నవ్వుకున్నాడు. కస్తూరి బాగానే ఆడుతుంది కానీ, అతడికి తెలుసు కస్తూరి ఎప్పటికీ తనని గెలవదని. అప్పుడప్పుడు ఓడిపోతున్నట్లు నటిస్తాడు. అది కస్తూరికి ఆశ కల్పిస్తుంది. అతడి నెట్లాగైనా ఓడించాలని కస్తూరికి పట్టుదల. అందుకని నిజంగా కుతూహలంతో ఆడుతుంది. కస్తూరితో కొంచెం సేపు కాలక్షేపం చెయ్యటానికి ఆడతాడు ప్రసాదరావు.

మొదటి బోర్డు కస్తూరి గెలిచింది. రెండు పాయింట్లు. రెడ్డు ప్రసాద్ కొట్టాడు. తరువాతి బోర్డు ప్రసాద్‌ది. ఏడు. మళ్లీ ఎనిమిది......మళ్లీ రెడ్డు లేకుండానే ఆరు. మళ్లీ పది. గేమయిపోయింది. ప్రసాదరావు లేచి కుర్చీలో కూర్చున్నాడు. కస్తూరి పందిరి మంచం మీద కూర్చుంది. కళ్లలోకి నీళ్లు వచ్చాయి. ''ఛ, ఏమిటిది! ఇట్లాగ ఏడుస్తావని తెలిస్తే నేనే ఓడిపోయేవాణ్ణి'' అన్నాడు నవ్వుతూ ప్రసాదరావు.

''అట్లాంటి గెలుపు నా కొద్దు. అంతకంటే రోజూ నీతో ఓడిపోవటమే నయం కానీ, నేను ఎప్పటికీ గెలవలేను.''

''ప్రయత్నించు, నువ్వు గెలిచేదాకా ఆడుతూనే ఉందాం.''

'గెలిచేదాకా ఆడటానికి నువ్వు ఇక్కడ ఇల్లాగే ఉండిపోతావా? జీవితాంతం?''

కస్తూరి అతడి కళ్లలోకి చూస్తూ అడిగింది.

జీవితాంతం అన్నమాట విని అతడు ఉలికిపడ్డాడు. జీవితాంతం గురించి అతడు ఆలోచించటంలేదు. బి.కామ్. పాసయి ఉద్యోగం కోసం ప్రయత్నిస్తున్నాడు. ఎక్కడ దొరికితే అక్కడికి వెంటనే వెళ్లిపోతాడు.

నేను రోజూ వస్తూనే ఉన్నాను కదూ'' అన్నాడు.

''నేను రోజూ ఓడిపోతాను మళ్లీ కస్తూరి కళ్లలో నీళ్లు.

''ఏడవకు, కస్తూరీ! నీ కళ్లు ఎంతో అందంగా ఉంటాయి. కానీ, నువ్వు ఏడవటం నాకు బాధగా ఉంటుంది''. లేచి కస్తూరికి దగ్గరిగా వెళ్లి భుజంమీద చెయ్యి వేసి అన్నాడు. కన్నీళ్ల మధ్య కస్తూరి అతడి ముఖంలోకి చూసింది. ఎప్పుడూ ఇల్లాగ జరగలేదు! ఈ వేళ తనకి ఆపుకోలేని ఏడుపు వచ్చింది.

''నా కోసం నువ్వు నిజంగా బాధ పడతావా? నేను జీవితంలోనే ఓడిపోయాను'' అంది.

ప్రసాదరావు కస్తూరిని కౌగిలించుకున్నాడు.

''నీకోసం నేను ఎప్పుడూ బాధపడుతుంటాను. నా ఆలోచనలలో ఎప్పుడూ నువ్వే ఉంటావు, కస్తూరీ! ఇక్కడికి ఎందుకు వస్తున్నా ననుకుంటున్నావు?''

ఆ క్షణాలలో అతడు నిజమే చెప్పాడు. పేరుకుపోయిన బాధని కరిగించేస్తూంది ఏడుపు. అతడి భుజం మీద తల ఆన్చి ఏడుస్తూంటే మనసు తేలిక పడుతూంది. ఆ క్షణంలో కస్తూరికి ప్రపంచం గుర్తు రాలేదు. తరవాతి క్షణాలలో గుర్తు వచ్చింది కానీ, అన్నయ్య, వదిన, ఇరుగు పొరుగులని కాలదన్ని పొందవలసింది ఒకటి ఉంది అనిపించిదింది. ఆర్తితో ప్రసాదరావుని బంధించింది. అతడు మెల్లగా తల వంచి కస్తూరిని చుంబించాడు. జరగకూడనిది జరిగిపోయింది. కస్తూరి బాల వితంతువు. ప్రసాదరావు సనాతన సంప్రదాయంలో పుట్టి పెరుగుతున్నవాడు. అతడికి సహజ వాంఛలున్నాయి. కానీ, ఆదర్శాలూ, ఆచరణాలూ లేవు. తన శక్తి తనకి తెలుసు. క్రిందికి వచ్చిన కస్తూరిని నఖశిఖ పర్యంతం పరికించి చూసింది రాజ్యలక్ష్మి. కస్తూరి వదిన చూపుల్ని తప్పించుకుంటూంది. అది చూసి రాజ్యలక్ష్మి ముసిముసిగా నవ్వుకుంది.

* * * *

ఆవిడ అల్లాగ కలకలలాడుతూ ఉండటం సామాన్యమైన విషయం కాదు. ఆవిడ భర్త కృష్ణమూర్తి శృంగార పరంగా నిజంగా కృష్ణపరమాత్ముడి అవతారమే. చదవటం

బి.ఎల్. చదివాడు కానీ, బోర్డు కట్టలేదు. తాతలు సంపాదించినది, తండ్రి మిగిల్చినది ఆస్తి చాలానే ఉంది అతడికి, గోదావరి జిల్లాలో. ఆంధ్రదేశంలో మిగతా చోట్ల లేని విశిష్టత ఒకటి గోదావరి జిల్లాలో ఉంది. అది భోగం మేళం. చిన్నతనం లోనే ముట్కాల ఇంట్లో పెళ్ళికి వచ్చిన భోగం మేళం అతడినాకర్షించింది. వాళ్ళ పరిచయం అయింది. దానితో అతడు పురుషార్థాలలో ముఖ్యమైన రెండింటికీ దూరమైపోయాడు. గృహస్థు దృష్టి లేదు. ధనం ఖర్చుచెయ్యటం తప్ప సంపాదించటం గురించిన ఆలోచన లేదతడికి.

పెళ్ళి అయ్యాక, మొదటి రోజు రాత్రి అతడు భార్యతో గడిపాడు.

రాజ్యలక్ష్మి తను అదృష్టవంతురాలననుకుంది.

రెండవ రోజు రాత్రి అతడు గిరిజ దగ్గిరకు వెళ్ళాడు.

మూడవ రోజు రాత్రి చంద్రకళ దగ్గిరకు వెళ్ళాడు. ఇంకా ఆ తరవాత రాజ్యలక్ష్మికి పగలు రాత్రి సమానమైపోయాయి.

రెండవ రోజు రాత్రి భర్త ఎక్కడికి వెళ్ళాడో తెలిసి ఏడిచింది.

మూడవ రోజు రాత్రి ఆత్మహత్య చేసుకుందామనుకుంది.

మర్నాడు రాత్రి భర్తని అడిగింది- ''మీకు నేను కావాలా? భోగం వాళ్లా అని.

''నువ్వు ఇప్పుడు వచ్చావు. నాకు అది పాత అలవాటు.. నువ్వూ కావాలి.''

''అంతమందిలో నేనొకదాన్ని మీకు లేకపోతేనేం?'' అంది.

''నిజమే, కానీ, నీకు నీనొకడినే కదూ'' అన్నాడు కృష్ణమూర్తి నిర్వికారంగా.

''అటువంటివాడు లేకపోతేనేం'' అంది రాజ్యలక్ష్మి.

''నీకంత అభిమానమైతె... అల్లాగే ఉండు'' అన్నాడు నవ్వుతూ.

రాజ్యలక్ష్మికి ఏడుపు రాలేదు. సముద్ర గర్భంలోంచి పొర్లుకు వచ్చిన కెరటం లాగ ఒక నవ్వు వచ్చింది. అప్పటినుంచి మళ్లీ ఎప్పుడూ ఏడవలేదు రాజ్యలక్ష్మి.

అతడు రాత్రి ఏ కళావతి దగ్గరికో వెళ్ళివస్తాడు.

''ఈ వేళ మీ ప్రేయసి ఎవరు?'' అని అడుగుతుంది రాజ్యలక్ష్మి నవ్వుతూ. కళావతికి పొడుగు జడ ఉందని, గిరిజ నవ్వుతుంటే పలువరుస ముత్యాల హారంలాగ ఉంటుందని, చంద్రకళ సన్నగా పొడుగ్గా జాజిమొగ్గ లాగ ఉంటుం దని రాజ్యలక్ష్మికి తెలుసు. కృష్ణమూర్తి స్వేచ్ఛకి ఆటంకం లేకపోయింది.

'వదిన ఏడవ దేమిటి? అన్నయ్యని కోప్పడ దేమిటి? అన్నయ్యని సన్మార్గంలోకి మళ్లించటానికి ప్రయత్నించ దేమిటి?' అని ఆశ్చర్యపోతుంది; బాధ పడుతుంది కస్తూరి.

ఇంత అందగత్తె అయిన వదిన వయసు భర్త ఉండికూడా అడవి గాచిన వెన్నెల' అవటం కస్తూరికి బాధగా ఉండేది.

భర్త ఉండి వదిన, లేక తను– ఇద్దరూ ఒకలాగే బ్రతుకుతున్నారు. కన్నీళ్లు పెట్టుకునేది. వదినని ప్రశ్నించేది కస్తూరి. అన్నింటికీ రాజ్యలక్ష్మి చిరునవ్వే సమాధానం. రాజ్యలక్ష్మి పల్లెటూరి పిల్ల. ఎక్కువ చదువుకోలేదు. కస్తూరి కంటె రెండేళ్లు పెద్దదైనా, రాజ్యలక్ష్మి కాపరానికి వచ్చేటప్పటికే కస్తూరిని మేనరికం ఇవ్వటం, ఆ పిల్లవాడు జబ్బుచేసి పోవటం జరిగిపోయాయి. ముందర రాజ్యలక్ష్మి కస్తూరిని గురించి అంత పట్టించుకునేది కాదు. క్రమంగా ఇద్దరి మధ్యా సాన్నిహిత్యం ఎక్కువైంది. బయట తిరుగుళ్లతో కృష్ణమూర్తికి తీరిక ఉండేది కాదు. ఇంటి పెత్తనమంతా రాజ్యలక్ష్మిదే. ఏ లోటూ రాకుండా చాకచక్యంతో రాజ్యలక్ష్మి ఇంటి వ్యవహారాలు నిర్వహిస్తూంటే కృష్ణమూర్తి నిశ్చింతగా తిరిగేవాడు. కొత్తకొత్త అనుభవాల కోసం మద్రాసు దాకా వెళ్లేవాడు. కస్తూరికి మంచి చీరలు కొనేది. తనతో పాటు సమంగా అలంకరించేది. సాధారణంగా భర్త తిన్ననైన మనిషి కాకపోతే భార్యకి అలంకరణ మీద మోజు పోతుంది. వదిన నిత్య నూత్నంగా అలంకరించు కోవటం కస్తూరికి ఆశ్చర్యం కలిగించేది. వదిన అంటే కస్తూరికి భయం ఉంది; ప్రేమ ఉంది; చనువు ఉంది. ప్రసాదరావుతో కృష్ణమూర్తికి దూరపు చుట్టరికం ఉంది. అప్పుడప్పుడు వస్తూంటాడు రాజ్యలక్ష్మిని 'అక్కగారు' అంటాడు. కస్తూరికి కూడా అతడి దగ్గిర చనువు ఉంది. అతడు అందంగా, ఆరోగ్యంగా ఉంటాడు.

'ప్రసాద్ మీద నాకు హక్కు లేకపోయినా, అతడు పెళ్లి చేసుకుంటాడనుకుంటేనే నాకు అసూయగా, బాధగా ఉందే– వదిన తన భర్తని అల్లాగ వదిలేసి ఎల్లాగ నవ్వగలుగుతూంది!' అనుకుంది కస్తూరి.

* * * *

ప్రసాదరావు ఆ రోజు జరిగినదానికి చాలా విచారించాడు. మళ్లీ అక్కడికివెళ్లకూడదు. జరిగిందేదో జరిగిపోయింది మళ్లీ అదే పొరపాటు జరగ కూడదు అనుకున్నాడు. కస్తూరిని ఎవరైనా పెళ్లి చేసుకుంటే బాగుండును అనుకున్నాడు. కృష్ణమూర్తికి బుద్ధి లేదు. చెల్లెలి సంగతి పట్టించుకోడు అనుకున్నాడు. కానీ, అక్కడికి వెళ్లకుండా ఉండలేక పోయాడు.

''కస్తూరి పైనే ఉంది వెళ్లు'' అంది రాజ్యలక్ష్మి చిరునవ్వుతో

అతడు ఆలోచిస్తూ పైకి వెళ్లాడు. మళ్లీ కస్తూరితో ఏకాంతం. అదివరకే

ఏర్పడిన సాన్నిహిత్యం ఇద్దరినీ దగ్గిరకి చేర్చాయి.

రెండు మూడు సార్లు అట్లాగ జరిగాక 'రాజ్యలక్ష్మి గారు కావాలనే మాకు ఏకాంతం ఎందుకు కల్పిస్తూంది? కేవలం స్నేహంగా భావిస్తూందా? లేక కస్తూరిని నేను పెళ్లి చేసుకుంటా ననుకుంటూందా? అని ఆలోచన కలిగింది.

తరువాత అతడు అక్కడికి వెళ్లకుండా ఉండటానికి ప్రయత్నించాడు. అతడి ప్రయత్నం కష్టపడకుండానే ఫలించింది. అతడికి వేరే ఊళ్లో ఉద్యోగం దొరికింది. వెళ్లిపోయాడు.

తాగమని నోటికి మధుపాత్రని అందించి ఆ చేత్తోనే చెంప దెబ్బ కొట్టిన ట్లయింది కృష్ణమూర్తికి. ఒక రోజు భోజనం చేస్తున్నాడు కృష్ణమూర్తి. రాజ్యలక్ష్మి పక్కనే ఉండి వడ్డిస్తూంది. పెదిమల్ని దాటుతున్న నవ్వుని బిగపడుతూ, ''మీరు మామయ్య కాబోతున్నారు'' అంది 'రాజ్యలక్ష్మి, ఓరగా చూస్తూ.

''అంటే, మీ చెల్లెలు తల్లి కాబోతూంది.''

అతడి చేతిలో ఉన్న అన్నం ముద్ద కింద పడిపోయింది.

''ఏమిటంటున్నావు?!'' అతడు అర్థం కానట్లు రాజ్యలక్ష్మిని చూశాడు.

''ఎందు కలాగా చూస్తారు? కస్తూరి ప్రసాదరావుని ప్రేమించింది. వాళ్ళ ప్రేమ ఫలించింది'' అంది రాజ్యలక్ష్మి.

''కస్తూరీ!...నిజమా!''

''ఎందుకల్లాగ ఆశ్చర్యపడతారు? ఇందులో వింతేముంది! వయసులో ఉన్న ఆడదాన్ని చూస్తే మగవాడి కేమవుతుందో మీకు తెలియదూ? మగవాడి కళ్లలో కోరికకి నాగస్వరం విన్న పాము లాగ కళ్లు మూసుకుని ఆడది పురుషుడికి ఎల్లాగ లొంగిపోతుందో మీకు తెలియదూ? ఇందులో మీకు తెలియని దేముంది! కస్తూరి అదృష్టవంతురాలు కనక కడుపు ఫలించింది!''

''ఆపు!'' గట్టిగా అరిచాడు కృష్ణమూర్తి. తనకి అన్యాయం, అవమానం జరిగినట్లు ఉడికిపోతూంది అతడి మనసు. రాజ్యలక్ష్మిని తీవ్రంగా చూస్తూ— ''నువ్వు ఇంట్లో ఉంటూనే ఇంత అన్యాయం జరగనిచ్చావా?'' అని నిలదీసి అడిగాడు.

రాజ్యలక్ష్మి తొణకలేదు. ఆ పెదవులమీద చిరునవ్వు కాంతి తరగలేదు.

''మీరు ఎప్పుడైనా కస్తూరికి పెళ్లి చేద్దామని ఆలోచించారా? నేను ఏం చేయ గలను! నాకు జరిగిన అన్యాయాన్ని అరికట్టగలిగానా? కస్తూరిని గురించి బాధ

పడటానికి మీరున్నారు. చెల్లెలు అని బాధపడటానికి నాకెవ్వరూ లేకనే కదూ ఈ అవస్థ! భోజనం చెయ్యండి. గుత్తివంకాయ కూర ఈ రోజు నేనే చేశాను'' అంది.

''కూర తీసుకెళ్ళి గోదావరిలో పారెయ్యి. దానికి కడుపు వచ్చింది! ఏమిటి చెయ్యటం?'' కృష్ణమూర్తి దిగులుగా, దిక్కుతోచని వాడిలాగ నెత్తి మీద చెయ్యి పెట్టుకున్నాడు.

''నాకు ఆ భాగ్యం ఎప్పుడు కలుగుతుందా అని తపించాను. ఎదురుచూసే దాన్ని. కానీ, ఏం చేయగలిగాను!'' అంది రాజ్యలక్ష్మి, అతడిని తన చూపులతో వెన్నంటుతూ. కళ్లలో కాంతి, పెదిమల మీది నవ్వు వెలుగుని పుంజుకుంటున్నాయి.

కృష్ణమూర్తి భార్యని పరికించి చూశాడు.

''కస్తూరి చిన్న పిల్ల. దానికేమీ తెలియదు. నీకు నామీద కోపం. ఎంతకష్టు నవ్వు రాక్షసివి.''

''ప్రతి మనిషిలోనూ దేవుడూ, దెయ్యం ఉంటారు. మనం దేన్ని ప్రేరేపిస్తే అదే పలుకుతుంది'' అంది రాజ్యలక్ష్మి.

''ఛీ! నీకు సిగ్గులేదు. నిన్ను నమ్మాను నేను. నీ నవ్వు... మోసపోయాను. మనస్ఫూర్తిగా నా స్వేచ్ఛని అంగీకరించా మనుకున్నాను ఎంత ద్రోహం! ఈ ఇంట్లో నీకు స్థానం లేదు. వెళ్లిపో!'' అరిచాడు.

''అరవకండి ఊరికే. నేను ఎక్కడికీ వెళ్ళను. మీ భార్యగా నాకు అన్ని హక్కులూ ఉన్నాయి'' అంది రాజ్యలక్ష్మి తొణకకుండా.

''కస్తూరీ...''గర్జించి పిలిచాడు కృష్ణమూర్తి. చెయ్యి కడిగేసుకున్నాడు.

పక్కనే తలుపు చాటు నుంచి సంభాషణ వింటున్న కస్తూరి వణికిపోతూ ఇవతలికి వచ్చింది.

''ఇంక నీకు ఈ ఇంట్లో చోటు లేదు. ఫో... ఎక్కడికి పోతావో. నీకు కావలసిన డబ్బు తీసుకుని వెళ్ళు.'' కఠినంగా శాసిస్తూ అన్నాడు కృష్ణమూర్తి.

'వదిన రూపం ఇదా? కళ్లు మూసుకుపోయిన నాకు జరుగుతున్నది అర్థం కాలేదు.' కస్తూరి కూలబడి ఏడుస్తోంది. మోకాళ్లలో తల దాచుకుని వెక్కివెక్కి ఏడుస్తోంది.

'ఎక్కడికి వెడతాను! ఎవరున్నారు నాకు!' అనుకుంటూంది.

రాజ్యలక్ష్మి కృష్ణమూర్తిని, కస్తూరిని మార్చి మార్చి చూస్తోంది.

''ఎక్కడికైనా సరే...ఏ అనాథ శరణాలయానికో...'' అన్నాడు కృష్ణమూర్తి కర్కశంగా—

రాజ్యలక్ష్మి చూపుల్లోంచి తిరస్కారం దూసుకుని వచ్చింది. ''హుఁ! మగవాడు!'' అంది నవ్వుతూనే.

కస్తూరి దగ్గిరగా వెళ్ళింది. భుజాల చుట్టూ చేతులు వేసింది.

''ఏడవకు, కస్తూరీ! ఊరుకో, నేను బ్రతికి ఉండగా నీకు అన్యాయం జరగదు. నువ్వు దుఃఖించటానికి వీల్లేదు. అవును. నేను ప్రతీకారం తీసుకున్నాను. చూడు, చెల్లెలికి ఈ గతి పట్టిందని పాపం, ఎంత బాధ పడుతున్నారో! పరువు పోతుందని అంతకంటె బాధగా ఉంది, పాపం. ఈ మనిషికి బాధ అంటే ఏమిటో కొంచెం తెలిసినా చాలు నాకు. ప్రతీకారం జరిగినట్టే. కానీ, నీ మీద నాకు కోపం లేదు, కస్తూరీ. నీకు అపకారం కూడా తలపెట్టను నేను. జీవిత మంటే ఏమిటో తెలుసుకున్నావు. నువ్వు తప్పేమీ చెయ్యలేదు—''

కస్తూరి ఏడుపు ఆపి ఆశ్చర్యంగా వింటూంది.

''ఇంక భయపడవలసింది నలుగురూ ఏమంటారు అనే కదూ? వీళ్ళ కళ్ళు, నోళ్ళూ ముయ్యటం ఎంత సేపు! అర్ధ సంవత్సరం దేశాటనం చేసి వద్దాం. ఆ పిల్లాడు నా పిల్లవాడు గానే పెరుగుతాడు. నిజానికి కన్నందుకు వాడికి తల్లివి నువ్వు. బాధ్యత నేను మోస్తాను. తండ్రిని నేను. స్త్రీకి తనను ప్రేమించాల పురుషుడు లేకపోతే తను ప్రేమించేటందుకు కొడుకు... పిల్లలు కావాలి. కానీ, వాళ్ళమీద...వాళ్ళు నిన్ను ప్రేమించాలని ఆశ పెట్టుకో కూడదు కస్తూరీ! లే ఇంక ఏడవకు'' అంది, చెయ్యి పుచ్చుకుని లేపదీస్తూ.

రాజ్యలక్ష్మి మళ్ళీ నవ్వింది కృష్ణమూర్తిని చూసి. ఆవిడ చెవుల కున్న వజ్రాల దుద్దులు, బేసరి తళుక్కుమని మెరిశాయి.

* * * *

వారం తిరక్కుండానే రాజ్యలక్ష్మి, కస్తూరి తీర్థయాత్రలకి వెళ్ళారు. డబ్బు వ్యవహారాలు చూడటానికి ఒక ముట్టపాయన్ని గుమాస్తాగా కుదిర్చింది. భార్యా, చెల్లెలూ వెళ్ళిన మరునాడు కృష్ణమూర్తి గోదావరి స్నానానికి వెళ్ళాడు. మళ్ళీ తిరిగి రాలేదు. అతడు చచ్చిపోయాడని కబురు వెళ్ళింది రాజ్యలక్ష్మికి. వెంటనే రాలేదు రాజ్యలక్ష్మి. భర్త శవం కనిపించలే దని బొట్టు చెరపటానికి తిరస్కరించింది. మళ్ళీ రెండు నెలల పిల్లవాడిని తీసుకుని ఆ ఊరికి తిరిగి వచ్చారు. అది పన్నెండేళ్ళ క్రిందట!

* * * *

పన్నెండేళ్ల క్రిందట గోదావరిలో మునిగిపోయిన కృష్ణమూర్తి కాలంలో ఈది ఇప్పుడు ఈ విధంగా పైకి తేలాడు. ఈ స్వామీజీ రూపంలో తన కళ్ళ ఎదుట ఉన్నాడు. చూడగానే అతడిని గుర్తు పట్టింది. ఎందుకు గుర్తు పట్టలేదూ? అతడు తన భర్త— ప్రేమించినా, ద్వేషించినా! అతడు రేపు వెళ్లిపోతాడు. ఇల్లాగ వెళ్లిపోనివ్వటమేనా? మనసు విభ్రమానికి లోనవుతూంది. ఆ పుట్టుమచ్చని చూస్తూంటే పాత బంధం, కనపడని బంధం మనసులో మెదులుతూంది. ఏదో అసంపూర్తిగా మిగిలిపోయిన ట్లనిపిస్తూంది.

భజన పూర్తి అయింది. స్వామీజీ కళ్లు తెరిచారు. ఆయన దర్శనం కోరిన వాళ్లు ఒక వరసలో వెళ్లి ఆయన పాదాలకు నమస్కరించి వెళ్లి పోతున్నారు. స్వామీజీ వాళ్లని ఆశీర్వదిస్తున్నారు.

చటుక్కున తెలివి వచ్చినట్లయింది రాజ్యలక్ష్మికి. చుట్టూ చూసింది.

ఎంతమంది జనం! అతడికి ఎంత పేరు! ఎంత జరుగుబాటు!

'మీ ఈ స్థితికి, గతికి నేనే కారణం!' గర్వంగా అనుకుంది.

తనకి అతడిమీద మమకారం లేదు. అతడూ అన్నీ తెంచుకుని ఇంతవా డయ్యాడు! ఇంకేం కావాలి? ఈ బ్రతుకులకి ఇదే ముగింపు.

నిశ్చలమైన మనసుతో ముందుకు నడిచింది రాజ్యలక్ష్మి. పాదాలు తాకి నమస్కరించినప్పుడు రాజ్యలక్ష్మిని ఆశీర్వదించారు స్వామీజీ. అందరి లాగా ముందుకి కదలలేదు. నిలబడిపోయిం దామె! స్వామీజీ తల ఎత్తి చూశారు.

''నువ్వా!'' అన్నారు.

రాజ్యలక్ష్మి మొహంలోకి నవ్వు వచ్చింది.

''ఆఁ నేనే. సెలవు. మీరు ధన్యు లయ్యారు. నేను కూడా ధన్యురాలినే'' అని ముందుకు నడిచింది.

ఇంటి మొహం పట్టింది. విసవిసా నడుస్తూంది. వజ్రాల దుద్దులు, బేసరి తళుకుమంటున్నాయి. పెదిమల మీద చిరునవ్వు వెలిగిపోతూంది.

'బుజ్జి కోవా కజ్జికాయలు చేసిపెట్టమన్నాడు.'

వాడు గుర్తు వచ్చి ఇంటివైపు గబగబా నడిచింది.

* * * *